క్లుప్తంగా

బాబూ.. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పండి

పల్నాడు హాస్పటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌బాబు



పిడుగురాళ్ల: తిరుమల లడ్డూ వివాదంపై సూపర్ సిక్స్ ప్రశ్నలకు సీఎం చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ నేత, పల్నాడు హాస్పటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో ఆ ప్రశ్నలను సంధించారు. ''జూలై 23న టీటీడీ లడ్డూకు సంబంధించి రిపోర్ట్ వస్తే ఇన్ని రోజులు అధికారులు, పాలకులు అందులోని విషయాలను ఎందుకు దాచారు? నిజంగా జంతువుల కొవ్వు ప్రసాదంలో కలిసి ఉంటే సంబంధిత అధికారులను, సరఫరా కంపెనీ వారిని ఎందుకు అరెస్టు చేయలేదు? ల్యాబ్ రిఫరెన్స్ నంబర్ మొదట మీడియాలో వచ్చిన దానికి, తర్వాత వచ్చిన దానికి ఎందుకు తేడా ఉంది? ఈవో రెండు రోజుల ముందు ప్రెస్‌మీట్‌లో వెజిటబుల్ ఫ్యాట్ అని చెప్పి.. తర్వాత ప్రెస్ మీట్‌లో యానిమల్ ఫ్యాట్ అని ఎందుకు మాట మార్చారు? కావాలనే కేఎంఎఫ్ (నందిని) సప్లయర్స్‌ను తిరుమలలో ఆపారంటున్న టీడీపీ, 2015–18 మధ్య ఇదే కేఎంఎఫ్‌ని ఎందుకు ఆపింది? లడ్డూలో నాణ్యత లేదంటున్నప్పుడు ఎందుకు సీబీఐ, సిట్టింగ్ జడ్జితో విచారణ కోరడం లేదు?' అని ప్రశ్నించారు.

ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు అందజేత



దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కి కుర్చీలను శనివారం అందజేశారు. హైస్కూల్ పూర్వ విద్యార్థి తగిరస రవికిరణ్ 10 కుర్చీలను తన తల్లిదండ్రులు నరసింహరావు, ప్రసన్నకుమారిల ద్వారా ఉపాధ్యాయులకు అందించారు. ప్రసన్నకుమారి ఈ హైస్కూల్‌లో విద్యా వలంటీర్‌గా పనిచేసి ప్రస్తుతం ప్రకాశం జిల్లా రాచర్ల కేజీబీవీలో తెలుగు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారు. దీంతో దాతలు నరసింహరావు, ప్రసన్నకుమారిలను హెచ్‌ఎంలు బళ్లా మేరి శ్యాంకుమారి, ఎల్వీ రామిరెడ్డి, ఉపాధ్యాయులు గుదిబండి శ్రీనివాసరెడ్డి, లంకె వాసుదేవరావు, అజయ్‌కుమార్ తదితరులు ఘనంగా సన్మానించారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ వెనుకభాగంలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బోయ రామిరెడ్డి, బండ్ల వెంకటేశ్వర్లు, అర్చకుడు అడిగొప్పల చెన్నకేశవాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా, వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కల్తీ వ్యాపారంపై చర్యలు తీసుకోండి

అధికారులకు సీపీఐ విజ్ఞప్తి

నరసరావుపేట ఈస్ట్: జిల్లా కేంద్రంలో కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ శనివారం తెలిపారు. జంతువుల కొవ్వుతో తయారైన కల్తీ నూనెలు, కల్తీ ఆహార పదార్థాలు, కల్తీ మందులతో ప్రజల ఆరోగ్యాన్ని చెడగొడుతున్నారని ఆరోపించారు. చివరకు మంచినీటిని కూడా కల్తీ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. మినరల్ వాటర్ పేరుతో కల్తీ త్రాగునీటిని విక్రయిస్తున్న ఆర్‌ఓ ప్లాంట్‌లపై అధికారులు దాడులు చేసి శిక్షించాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి కల్తీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజల తరపున ఆందోళన చేపతామని హెచ్చరించారు.

నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారుల ఎంపిక

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో అండర్-14, అండర్ -17 స్కూల్ గేమ్స్‌కు సంబంధించి క్రీడాకారుల ఎంపిక ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బీఎం. సుభాని శనివారం తెలిపారు. ఆరు క్రీడలకు సంబంధించిన ఎంపిక జరుగుతుందన్నారు. కబాడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్‌బ్యాట్మింటన్ ఆటలు ఆడేందుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో పాల్గొనే క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు అందరూ సోమవారం 9.30 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రొంపిచర్లలో హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

- మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం
- సత్తా చాటుతున్న విద్యార్థులు



పిడుగురాళ్లలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) మండల స్థాయి ఆటల పోటీలు శనివారం జరిగాయి. అండర్–14 విభాగంలో బాలురు, బాలికలు, అండర్ -17 విభాగంలో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ విభాగాల్లో వాలిబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు. పిడుగురాళ్ల పట్టణం, మండలంలోని 320 మంది విద్యార్థులు ఈ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. పీడీలు దానియేలు, ఎం.మోహన్‌కుమారి, సౌజన్య, శివరామకృష్ణ, నందిపాటి నర్సిరెడ్డి, పీఈటీ సాతులూరి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

దుర్గి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. శనివారం పలు పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలను ఎస్‌ఎంసీ చైర్మన్ గాలయ్య, హెచ్‌ఎం పి.కోటేశ్వరమ్మలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెంపుదలకు దోహదం చేస్తాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత ఉంటుందన్నారు. పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గి జెడ్పీ స్కూల్‌లో ఆటల పోటీలకు హాజరైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



పిడుగురాళ్ల మన్నెం జెడ్పీ పాఠశాలలో కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

మెగా ఉచిత కంటి వైద్యశిబిరం



అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

దుర్గి: నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్, దుర్గి వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి 65 మంది హాజరుకాగా 23 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు వాసవి క్లబ్ దుర్గి అధ్యక్షులు కాసుల ప్రసాద్, సెక్రెటరీ పలుచూరి నాగేశ్వరరావులు తెలిపారు. మిగిలిన వారికి మందులను పంపిణీ చేసి కంటి వైద్యానికి సహకారాన్ని అందించిన శాంతిరామ్ ఆసుపత్రి, నంద్యాల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు పి.మల్లయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మెగా కంటి వైద్యశిబిరం

మాచర్ల: పట్టణంలోని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో స్వర్గీయ ఓరుగంటి పురుషోత్తం సైదమ్మల జ్ఞాపకార్థం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చెన్నకేశవరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, సెక్రటరీ పందిరి నరసింహారావులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ శాంతిరామ్ మెడికల్ కాలేజీ, నంధ్యాల వారి ఆధ్వర్యంలో ఆదివారం శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మాచర్ల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్లాలు కలిగిన వారికి క్యాంపు జరిగిన రోజే ఆపరేషన్ అవసరమైతే ఆసుపత్రి వారి బస్సులోనే నంద్యాలకు తీసుకొని ఆపరేషన్ చేయించటం జరుగుతుందన్నారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చేవారు ఆరోగ్య శ్రీ కార్డు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాసుపుస్తకం, రెండు జతల బట్టలు, దుప్పట్లు తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9100510326, 9985750735 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపించొద్దు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్

దాచేపల్లి: హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపించవద్దని, వారిపై ప్రేమను చూపించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా అనే హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో శనివారం నిర్వహించారు. హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. హెచ్‌ఐవీ సోకిన వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే జీవితకాలాన్ని పెంచుకోవచ్చునని ఆయన చెప్పారు. రీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ మేనేజర్ కోమలి, ఏఎన్‌ఎం యలమందమ్మ, ఓఆర్‌డబ్ల్యూ కోటేశ్వరి, నాగరాజు, పీఈలు మేరీప్రిస్కిల్లా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రార్థన కూటములు

మాచర్ల: ప్రతి వ్యక్తి ఏసుక్రీస్తును ఆరాధించి బైబిల్‌లోని సూక్తులను పాటించి, ప్రభువు కృప పొందాలని బాపట్లకు చెందిన బ్రదర్ రత్నం అన్నారు. పట్టణంలోని మిస్సమ్మ ఆసుపత్రి ప్రాంగణంలో ఇవాంజిలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రార్థన కూటములు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా బ్రదర్ రత్నం దైవ సందేశాన్ని అందించారు. మూడు రోజుల పాటు వేలాది మంది పాల్గొన్న ఈ సభలకు కాపరి బ్రదర్ నట్టువ ప్రభాకర్‌రావు అధ్యక్షత వహించగా, బ్రదర్‌లు జాన్ హైడ్, పీటర్‌పాల్, రత్నాలుతో పాటు పలువురు సందేశాలందించి ప్రత్యేక ప్రార్థనలతో దీవెనలందించారు.

పింఛన్లు పెంచి ఇస్తున్నాం

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి

కారెంపూడి: సంక్షోభంలోనూ సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేసి చూపుతోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం వంద రోజులపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడారు. వృద్ధులు, వితంతువులు ఇతరుల పింఛన్ రూ.4 వేలకు పెంచి ఇస్తున్నామని, అలాగే దివ్యాంగుల పింఛన్ రూ. 6 వేలకు పెంచి ఇవ్వడం జరుగుతోందన్నారు. సభ ప్రారంభానికి ముందు కారెంపూడిలో కొన్ని ఇళ్లకు వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాన్ని వివరిస్తూ ఉన్న కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో మండల అధికారులు, మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు కార్మికులకు వైద్య పరీక్షలు

పెదకూరపాడు : మండల పరిధిలోని 20 గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ విద్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుధ్య కార్మికులకు ఈసీజీ, రక్త, బీపీ, షుగర్ వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

డిప్యూటీ డీఈఓ. వేణుగోపాలరావు



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న వేణుగోపాలరావు

నరసరావుపేట ఈస్ట్: చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డిప్యూటీ డీఈఓ. కె.వేణుగోపాలరావు తెలిపారు. బరంపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల పఠనా నైపుణ్యాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల నోట్స్‌బుక్స్‌తో పాటు ఉపాధ్యాయుల టీచింగ్ నోట్స్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంచుకోవటంతో పాటు విద్యార్థులలో అభ్యాసన నైపుణ్యాలను పెంచాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందివ్వాలని ఆదేశించారు. అలాగే మధ్యాహ్న భోజనం ఆయా రోజుల్లో పర్యవేక్షించే ఉపాధ్యాయులు పొరపాట్లు జరగకుండా చూసుకోవాలనీ, ఎటువంటి పొరపాటు జరిగినా అందుకు బాధ్యత సదరు ఉపాధ్యాయుడుదేనని స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదలలో పోషణ మాసోత్సవం

మాదల(ముప్పాళ్ళ): మాదల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహా మాసోత్సవం కార్యక్రమం శనివారం జరిగింది. సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొని గర్భిణులు బరువు చూసి, పెరుగుదలలో వచ్చిన మార్పుల గురించి వారితో చర్చించారు. పోషకాహారం, రక్తహీనత, పరిశుభ్రతల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.శాంతి, టి.సుధారాణి, ఎల్.అన్నపూర్ణ, సీహెచ్ వీరమ్మ, వి.అంజమ్మ, వి.అనురాధ, డి.వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ప్రజా వేదిక

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ సోషల్ ఆడిట్‌పై ప్రజా వేదిక నిర్వహించారు. ప్రజావేదిక ఎండీవో మాధ్యుబాబు అధ్యక్షతన జరిగింది. ఈ నెల 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు గ్రామంలో జరిగిన పనులపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై ప్రజా వేదికలో చర్చించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.3 లక్షల రూపాయల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఈ మొత్తాన్ని రికవరీ చేయాలని ప్రజావేదిక తీర్మానించారు. ప్రజా వేదికలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసెఫ్ కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇస్సపాలెంలో ధ్యాన శిక్షణ తరగతులు



ధ్యాన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న స్వామీజీ, పాల్గొన్న మహిళలు

నరసరావుపేట: ఇసప్పాలెం గ్రామంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో చాతుర్మాస దీక్ష శిక్షణ తరగతుల సందర్భంగా శనివారం బరంపేట లీలా వెంకటేశ్వర స్వామి వారి భక్త సమాజం వారిచే విష్ణు సహస్రనామ పారాయణం, సత్సంగ కార్యక్రమం, గీతా పారాయణం నిర్వహించారు. సజ్జాపురం స్వామీజీ మాట్లాడుతూ నవంబరు 16 సోమవారం వరకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనికి భక్తులు అందరూ ఆహ్వానితులే అన్నారు. కపలవాయి విజయ్ కుమార్, కేపీ.రంగారావు, పూరా భాస్కరరావు, చేగు వెంకటేశ్వరరావు, పూరా లక్ష్మీ సుజాత, మంగవల్లి నాగలక్ష్మితో పాటు అనేకమంది మహిళా భక్తులు పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'బుగ్గవాగు' నుంచి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోండి

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పేరుపోగు రామయ్య



దుర్గి: మండలంలోని బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పేరుపోగు రామయ్య డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బుగ్గవాగు డ్యాం నుంచి ఆత్మకూరు, పోలేపల్లి, ముటుకూరు, కంచరగుంట గ్రామాలకు తాగునీటి సరఫరా రావటం లేదని, దీనివలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. భారీ వర్షాలతో ప్రాజెక్టులు నిండుకుండలా ఉన్నా.. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. సమస్యపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జోక్యం చేసుకొని తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ



బిగ్‌హెల్ప్ సంస్థ అందజేసిన ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలతో విద్యార్థులు

విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 40మంది 8వ తరగతి విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ అందజేసిన ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలను శనివారం హెచ్‌ఎం ఉప్పులూరి లక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 9న నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు 8వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 చివరి తేదీ అన్నారు. ఈ పరీక్షకు ఎంపికైన విద్యార్థులకు 4 సంవత్సరాలు పాలు ఏడాదికి 12వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సెలక్ట్ కావాలని సూచించారు. అనంతరం బిగ్‌హెల్ప్ ప్రాజెక్టు డైరెక్టర్ కోట్ల కోటీశ్వరావు మాట్లాడుతూ బిగ్‌హెల్ప్ సంస్థ ఫౌండర్, చైర్మన్, ఎన్ఆర్ఐ షేక్ చాంద్‌బాష రూ.10వేలు విలువచేసే ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలను పాఠశాలకు పంపడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు పాదరక్షలను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాచర్లలో స్వచ్ఛత హీ కార్యక్రమం



కోలగుట్లలో ...

మాచర్ల: మెప్మా ప్రాజెక్టు మేనేజర్ ఎం.సుబ్బారావు, సీఈఓలు అంజలి, రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలక సంఘ కార్యాలయంలో వాటర్ ప్లాంట్ ప్రాంతంలో గడ్డి తొలగించటం, పరిసరాలు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా మేనేజర్ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛత కార్యక్రమాన్ని అక్టోబర్ నెల వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంపై ప్రతి వార్డుతో పాటు ఆయా వార్డులలో ఆర్పీలు గ్రూప్ సమావేశాలలో స్వచ్ఛత - ప్రజల బాధ్యత అని తెలియపర్చాలన్నారు. ఈ సందర్భంగా పురపాలక క్వారీ ప్రాంతంలోని పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపరచి, గడ్డిని తొలగించి స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

దుర్గి: పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందని పలువురు నేతలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కోలగుట్ల గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ శివశంకర్ ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ బెంజిమెన్ తెలిపారు. మాజీ సర్పంచ్ పోటు శంకర్, టీడీపీ నేతలు గర్నే రమేష్, భిక్షాలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గుర్తింపు అభినందనీయం

- ఎంఈవో మద్దికుంట సాంబశివరావు
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సత్కారం



ఉపాధ్యాయ గ్రహీతలను సత్కరిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

శావల్యాపురం: పాఠశాలల అభ్యున్నతితో పాటుగా సామాజిక సేవా భావం కల్గియున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించటం అభినందనీయమని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శనివారం స్థానిక మండల వనరుల కేంద్రంలో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘనంగా సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలతో పాటు సమాజ భాగస్వాములై భావితరాలకు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనదన్నారు. ప్రతి ఉపాధ్యాయులు సమాజానికి మర్గదర్శకంగా మెలగాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత భోదకులు కుమ్మరి శ్రీనివాసరాజు, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు బిళ్ళ రాజారమేష్ సేవలను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి, జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి, సింగంసెట్టి అన్నపూర్ణమ్మ, షేక్ మహమ్మద్ సుభాని, ఉమా మహేశ్వరరావు, ఎస్టీయూ నాయకులు కొండ్రముట్ల వెంకటరత్నం, కంప శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు మాదాల రామకోటేశ్వరరావు, డి.రవికుమార్, గుండ్లూరి ప్రసాదు, సీనియర్ అంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది లింగాల శ్రీహరి, బోయపాటి తివిక్రమ్, మస్తాన్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పవన్‌కుమార్

చిలకలూరిపేట: విద్యార్థులు జాతీయస్థాయి గణిత, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించటం అభినందనీయమని వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ దండా పవన్‌కుమార్ చెప్పారు. స్ప్రింగ్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ మాథమాటిక్స్ ఒలంపియాడ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరిలో మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలంపియాడ్ పోటీలు జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఇటీవల ప్రకటించిన ఫలితాలలో వికాస్ విద్యాసంస్థలకు చెందిన ఎ.రేణుక, ఎస్.ఇందుశ్రీ, ఎస్‌కె ఇమ్రాన్, ఈ.యశ్వంత్, కె.రుత్విక, పి.తేజశ్విని, ఎస్.నమ్రుతవేణి, సీహెచ్ దీక్షిత్, ఎస్.బతిజైన్ 25 లోపు ర్యాంకులు సాధించారు. ఈ విద్యార్థులకు శనివారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దండా పవన్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 2.13 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో తమ విద్యార్థులు ర్యాంకులు సాధించటం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.